చందన చెరువు శిఖం కబ్జాలపై హైడ్రామా

కలెక్టరేట్ ఉన్నతాధికారుల ఆదేశాలకూ దిక్కులేని వైనం

నీటిపారుదల శాఖ ఇంజినీర్లు వస్తామన్నా స్పందించని రెవెన్యూ

- రికార్డులు ఇవ్వమంటే రెవెన్యూ అధికారులు సహకరించడం లేదు : ఇరిగేషన్ డీఈ
- ఆక్రమణల తొలగింపునకు సిబ్బందిని పంపిస్తామన్నాం: మీర్‌పేట కమిషనర్

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 20 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడలోని చందన చెరువు శిఖం కబ్జా తొలగింపులపై హైడ్రామా చోటు చేసుకుంది. సాక్షాత్తూ జిల్లా కలెక్టరేట్ నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ కిందిస్థాయి రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదే ఆక్రమణదారులకు వరంగా మారుతుంది. ఈ నేపథ్యంలో శిఖం భూముల్ని ఫలహారంగా పంచుకున్నారనేందుకు మరికొన్ని ఆధారాలు కూడా బయటికొస్తున్నాయి. నకిలీ పాత పాసు పుస్తకాలను అడ్డు పెట్టుకొని చెరువును చెరబడుతున్నప్పటికీ అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. మరోవైపు నీటిపారుదల శాఖ అధికారులు కూడా చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేపట్టేందుకు వస్తున్నట్లు సమాచారం ఇచ్చినప్పటికీ స్థానిక రెవెన్యూ యంత్రాంగం సహాయ నిరాకరణ చేపట్టడం మరిన్ని అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనాన్ని చూసి క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చేందుకు సిద్ధమైన తమకు రికార్డులు ఇచ్చి సహకరించమంటే స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి సానుకూల స్పందన లేదని సాక్షాత్తూ ఇరిగేషన్ డీఈ చెబుతుండటం గమనార్హం.

జిల్లెలగూడలో ఆర్‌సీఐకు వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న చందన చెరువు ఆక్రమణలో చిక్కుకున్న విషయం తెలిసిందే. దీనిపై స్థానికులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా... ల్యాండ్ ప్రొటెక్షన్ అధికారులు సమగ్ర విచారణ చేసి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆర్డీవో, తాసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల కిందట ఇదే అంశంపై 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీంతో అక్రమంగా ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లను తొలగించాలంటూ విద్యుత్తు శాఖకు లేఖ రాసిన బాలాపూర్ తాసీల్దార్... కబ్జాల తొలగింపునకు చర్యలు తీసుకుంటానని కూడా రెండు రోజుల కింద స్పష్టం చేశారు. కానీ తదుపరి చర్యలపై మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఫిర్యాదుదారులు దీనిపై ప్రశ్నించినప్పటికీ తమకు ఇతరత్రా పనులు ఉన్నాయంటూ దాట వేస్తున్నారు. కాగా కలెక్టర్ దృష్టికి వెళ్లిన కబ్జాలే కాకుండా ఇంకా చెరువు శిఖంలో మరిన్ని ఆక్రమణలు ఉన్నట్లు వివరాలు బయటికొస్తున్నాయి. పక్కనే ఉన్న పట్టా భూమిని ఆసరాగా చేసుకొని నకిలీ పాత పాసు పుస్తకాలు తయారు చేసి పలువురు శిఖం భూముల్ని చెరబట్టినట్లు తెలిసింది. వీటి ఆధారంగానే జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేసుకునేందుకు పెద్ద ఎత్తున ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం.

చర్యలు తీసుకోక... సహకరించక...

చందన చెరువు కబ్జాలపై రెవెన్యూ యంత్రాంగం తీరు విచిత్రంగా కనిపిస్తున్నది. వాస్తవానికి లేక్ ప్రొటెక్షన్ కమిటీలో నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంతో తాము క్షేత్రస్థాయిలో విచారణ చేసేందుకు సిద్ధమైనట్లు నీటిపారుదల శాఖ డీఈ డీబీ నాయక్ తెలిపారు. అయితే శనివారం తాము క్షేత్రస్థాయికి వచ్చి, పరిశీలిస్తామని బాలాపూర్ తాసీల్దార్‌కు సమాచారమిచ్చినట్లు చెప్పారు. అయితే తమకు వేరే పని ఉన్నందున తాము రాలేమని తాసీల్దార్ చెప్పడంతో తాము కూడా విరమించుకున్నట్లు పేర్కొన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్‌ను తమ శాఖ నిర్ధారిస్తుందని, అందులో ఆక్రమణలు ఉంటే వాటిని గుర్తించాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉందన్నారు. ముఖ్యంగా చెరువుకు సంబంధించిన రికార్డులన్నీ రెవెన్యూ శాఖ వద్ద ఉంటాయని, తాము క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలంటే రికార్డులు ఉంటే తప్ప సాధ్యం కాదన్నారు. ఈ క్రమంలోనే శనివారం కబ్జాలపై విచారించేందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నప్పటికీ రెవెన్యూ అధికారులు రాలేమని చెప్పడంతో వెనక్కి తగ్గామన్నారు. కాగా చందన చెరువు శిఖం ఆక్రమణలపై తాసీల్దార్ తమకు కూడా సమాచారం ఇచ్చారని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వాణి రెడ్డి తెలిపారు. అయితే ఆక్రమణల తొలగింపునకు సాయం చేసేందుకుగాను తమ సిబ్బందిని పంపిస్తానని చెప్పానని, తర్వాత ఎలాంటి సమాచారం లేదన్నారు.

24న జీసీసీ ఈఆర్‌డీ ప్రారంభం

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ (హైసియా) ఆధ్వర్యంలో కొత్తగా గ్లోబల్ కెపబిలిటీ సెంటర్(జీసీసీ) ఇంజినీరింగ్ ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా పదుల సంఖ్యలో దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు తమ జీసీసీలను ఏర్పాటు చేశాయి. కొత్తగా ఇంజినీరింగ్ సేవలందించే కంపెనీలతో జీసీసీ ఈఆర్‌డీ ఫోరాన్ని ప్రారంభించనున్నారు. ఈనెల 24న గచ్చిబౌలిలోని హయత్ హోటల్‌లో ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా జిన్నోవ్ కంపెనీ ప్రతినిధి మహ్మద్ ఫరాజ్ ఖాన్ కీలక ఉపన్యాసం చేయనున్నారని హైసియా ప్రతినిధి తెలిపారు.

జీవో 142ను వెంటనే రద్దు చేయాలి

సుల్తాన్‌బజార్, జనవరి 20: వైద్యారోగ్య శాఖలోని ఉద్యోగులకు గొడ్డలి పెట్టుగా ఉన్న జీవో 142ను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో ఫిబ్రవరి 5 నుంచి సమ్మెకు దిగుతామని జీవో 142 అబోటిషన్ స్ట్రగల్ కమిటీ ప్రతినిధులు బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి, శ్యాం సుందర్, కర్నాటి సాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వైద్య, ఆరోగ్య శాఖలోని అన్ని అసోసియేషన్లు ఒకే వేదికగా జీవో 142 అబోటిషన్ స్ట్రగల్ కమిటీగా ఏర్పడి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్‌ను కలిసి జీవో 142ను రద్దు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రామలక్ష్మి, భరత్ సత్యనారాయణ, కె.బలరాం, వెంకటేశ్వర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో క్రీడాకారులకు ప్రోత్సాహం కరువు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

జాతీయ స్థాయి కరాటే పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

జూబ్లీహిల్స్, జనవరి 20 : జాతీయ స్థాయిలో క్రీడలకు, క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైందని.. ఫలితంగా క్రీడారంగంలో అనేక మంది ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులు మరుగున పడిపోతున్నారని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో యునిక్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి కరాటే పోటీలను తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతోనే ఆరోగ్యం, అభివృద్ధి అని గుర్తించి అనేక దేశాలు క్రీడలను ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయన్నారు. మన దేశంలో తల్లిదండ్రులు బాల్య దశ నుంచే తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నప్పటికీ ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజేశ్వరి, చౌహాన్, నరేశ్, సహదేవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

గణితం, సైన్స్ టీచర్ల ఓరియంటేషన్ కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : పరీక్షలు వచ్చినప్పుడు శ్రద్ధాసక్తులతో కృషి చేసినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం ఏసీ గార్డ్స్‌లోని హోలీ మేరీ ఉన్నత పాఠశాల, సికింద్రాబాద్‌లోని కీస్ ఉన్నత పాఠశాలలో గణితం, సైన్స్ ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు వంద శాతం ఫలితాలు సాధిస్తామన్న నమ్మకంతో తగిన చర్యలు తీసుకున్నట్లయితే గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థి మంచి జీవితం పొందుతారని తెలిపారు. చదువులో ఎంతో వెనకబడిన విద్యార్థి కూడా కష్టపడి చదివినట్లయతే తప్పకుండా ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో పాస్ శాతం చాలా తక్కువగా ఉందని, ప్రతి ఉపాధ్యాయుడు వచ్చే 60 రోజుల్లో విద్యార్థిని పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రోహిణి, డిప్యూటీ ఈవోలు, జిల్లాకు చెందిన గణితం, సైన్స్ ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

జేఎన్‌జే కమిటీ రద్దు..

- ఫిబ్రవరి 4న అడహక్ బోర్డు ఎన్నిక
- నోటీస్ జారీ చేసిన సహకార శాఖ

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌజింగ్ సొసైటీ డైరెక్టర్ పోస్టులకు ఎన్నికలు నిర్వహించడానికి అడ్‌హక్ బోర్డును ఏర్పాటు చేయాలని సహకార శాఖ నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా సహకార శాఖ రిజిస్ట్రార్ డి.రమాదేవి శనివారం నోటీసులు జారీ చేశారు. ఆ శాఖ అధికారి రమాదేవితో పాటు డిప్యూటీ రిజిస్ట్రార్ వెంకట్‌రెడ్డి, నిజాంపేట్‌లోని జేఎన్‌జే కార్యాలయానికి వెళ్లి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆ వెంటనే నోటీసు జారీ చేశారు. ఫిబ్రవరి 4న ఉదయం 11.30 గంటలకు జేఎన్‌జే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు రమాదేవి నోటీసులో పేర్కొన్నారు. అయితే జేఎన్‌జే స్థలంలోనే సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అడహక్ బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశానికి సహకార శాఖ సికింద్రాబాద్ డిప్యూటీ రిజిస్ట్రార్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ బోర్డు జేఎన్‌జే మ్యాక్ హౌజింగ్ సొసైటీకి ఐదు డైరెక్టర్ పోస్టులకు ఎన్నికల నిర్వహిస్తుంది. అయితే నెల రోజుల్లోగా ఎన్నికల ప్రక్రియ ఈ బోర్డు పూర్తి చేయాల్సి ఉంది.

ఎంతోకాలంగా జేఎన్‌జే హౌజింగ్ సొసైటీకి నూతన కమిటీ ఏర్పాటు చేయాలని టీమ్ జేఎన్‌జే చేసిన పోరాటానికి అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టీమ్ జేఎన్‌జే కృతజ్ఞతలు తెలిపింది. సభ్యులంతా ఫిబ్రవరి 4న జరిగే సర్వసభ్య సమావేశంలో తప్పనిసరిగా పాల్గొని బోర్డు ఎంపికకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడే మల్లన్న పట్నం వారం..

కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో మొదటి ఆదివారం(పట్నంవారం) సందర్భంగా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు శనివారం మల్లన్న క్షేత్రానికి తరలివచ్చారు. ఆదివారం స్వామి వారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకోనున్నారు. అలాగే సోమవారం నిర్వహించే పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమంలో భక్తులు పాల్గొంటారు.

-చేర్యాల, జనవరి 20

24 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 20: ఉస్మానియా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 24 నుంచి తరగతులు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతి రోజూ సాయంత్రం ఐదున్నర గంటల నుంచి 7 గంటల వరకు ప్రత్యేక బ్యాచ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 7989903001 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పేదలకు కేటాయించిన భూములపై హక్కులు కల్పించాలి

ఖైరతాబాద్, జనవరి 20 : పేదలకు కేటాయించిన భూములపై వారికే హక్కులు కల్పించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. అసైన్డ్ భూములకు శాశ్వత హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. విశ్రాంత కలెక్టర్ ఎంవీ రెడ్డి మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు వాస్తవానికి పేద వారి కోసమే కేటాయించిందని, సంవత్సరాల తరబడి వ్యవసాయం చేసుకున్నారన్నారు. 1977 పీవోటీ చట్టం ప్రకారం ఆ భూములను సాగుచేసుకోలేరని, అవసరానికి అమ్ముకునే పరిస్థితి లేదని, ఫలితంగా దానిపై ఆధారపడిన వారు కాలం కలిసి రాక అప్పులపాలవుతున్నారన్నారు. కొడుకు చదువుకోసం, కూతురు పెండ్లి కోసం భూమిని అమ్ముకోలేని దుస్థితిలో అసైన్డ్ భూముల యజమానులు ఉన్నారని తెలిపారు. పేదల కోసం ఈ చట్టాన్ని సవరించుకోవడంలో తప్పులేదన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ , అసైన్డ్ భూముల శాశ్వత హక్కుల సాధన సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మి రాజ్ కుమార్ రెడ్డి, మన్నె నర్సింహా రెడ్డి, కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో ఆప్ నాయకురాలు ఇందిరా శోభన్, తెలంగాణ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్, మాజీ తాసీల్దార్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : సీఎం క్యాంపు కార్యాలయం, ఆఫీసు పరిసర ప్రాంతాలకు తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపర్చడానికి చేపట్టిన పనులను జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయని వారు చెప్పడంతో ఎండీ సంతృప్తి వ్యక్తం చేశారు. జలమండలి చేపట్టే మరమ్మతులు, మ్యాన్‌హోల్ నిర్మాణం, పైపులైన్ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ఎండీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అజ్మీరా కృష్ణ, సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు తరలిస్తున్న మహిళకు జైలు..

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జనవరి 20(నమస్తే తెలంగాణ): మత్తుపదార్థాల తరలింపు కేసులో పట్టుబడ్డ విదేశీ మహిళ ముకుంబ కరోల్(31)కు పద్నాలుగేళ్ల జైలుశిక్ష మరియు లక్ష రూపాయల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభి రామారావు తీర్పునిచ్చారు. ప్రత్యేక పీపీ రాజశేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. జాంబియా దేశానికి చెందిన నిందితురాలు ముకుంబ కరోల్ మాదక ద్రవ్యాలను అక్రమంగా సరఫరా చేస్తుండగా సమాచారం అందుకున్న హైదరాబాద్‌కు చెందిన డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ అధికారులు నిందితురాలిని అదుపులోకి తీసుకొని మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితురాలైన ముకుంబ కరోల్‌కు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది

విశ్వబ్రాహ్మణులు శాసించే స్థాయికి ఎదగాలి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

హిమాయత్‌నగర్, జనవరి 20: రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని శాసించే స్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర 4వ కార్యవర్గ సమావేశం, నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నారాయణగూడలోని వెంకటేశ్వర కమ్యూనిటీ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి మధు సూదనాచారి హాజరై మాట్లాడుతూ.. విశ్వ బ్రాహ్మణుల్లో ఐక్యత లేకపోవడం వల్లే అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కలిసి కట్టుగా ముందుకు సాగి హక్కులు సాధించు కోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మదన్ మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వెంకటాచారి, విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం సభాపతి డాక్టర్ గౌరీశంకర్, పౌరసంబంధాల శాఖ సచివాలయం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ, కోశాధికారి రవీంద్రాచారి, ప్రతినిధి నాగేశ్వరరావుతో పాటు సంఘం 33 జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిలింనగర్ దైవసన్నిధానంలో విశేష పూజలు

మాట్లాడుతున్న ఫిలింనగర్ దైవసన్నిధానం చైర్మన్, నటుడు డా.మోహన్‌బాబు

బంజారాహిల్స్,జనవరి 20: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఫిలింనగర్ దైవ సన్నిధానంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో జనవరి 22న శ్రీ సీతారామ రథయాత్ర, శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఫిలింనగర్ దైవసన్నిధానం చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ, నటుడు డా.మంచు మోహన్‌బాబు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో మోహన్‌బాబు మాట్లాడుతూ.. అయోధ్య శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ దేశానికి మొత్తం పండుగలాంటిదన్నారు. అలాంటి పండుగను పురస్కరించుకొని ఈనెల 14నుంచి 22వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈనెల 22న ఉదయం 9గంటల నుంచి సప్తవిధ పుష్పార్చన, శ్రీ సీతారామచంద్రుల రథయాత్ర, శ్రీ రామ పట్టాభిషేకం శోభాయమానంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పరుచూరి గోపాలకృష్ణ, ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు ఆదిశేష గిరిరావు, కోమటిరెడ్డి లక్ష్మిరెడ్డి, కాజా సూర్యనారాయణ, చాముండేశ్వరినాథ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు అవార్డు

జూబ్లీహిల్స్, జనవరి20: వింగ్స్ ఇండియా 2024లో ప్రజల సందర్శనార్థం గేట్లు తెరిచిన తొలిరోజు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వీక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. వింగ్స్ ఇండియా–2024 ప్రదర్శనలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సస్టైనబిలిటీ అవార్డు అందుకుంది. వీక్షకులను ఆకట్టుకునే రీతిలో ప్రముఖ పెర్కుష్షనిస్ట్, పద్మశ్రీ అవార్డు గ్రహీత శివమణి మంత్రముగ్ధులను చేస్తూ లైవ్ ప్రదర్శన నిర్వహించారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ బ్రాండ్‌కు చెందిన సరికొత్త బోయింగ్ 737–8 ఎయిర్ క్రాఫ్ట్, వీటీ– బీఎక్స్‌హెచ్, 'కలంకారి'తో కూడిన టర్మాక్ వేదికగా శివమణి తన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కళారూపాలకు తమ శుభాభినందనలు అందజేసింది. అనంతరం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సిదార్థ బుటాలియా మాట్లాడుతూ .. భారతదేశ కళాత్మక ప్రతిభ, సంస్కృతిని వేడుక చేయడం పట్ల సంతోషిస్తున్నామన్నారు.అలాగే వింగ్స్ ఇండియా–2024 లో మా 'ప్యాట్నర్స్ ఆఫ్ ఇండియా' థీమ్‌లో ప్రత్యేకమైన టెయిల్ ఆర్ట్ డిజైన్‌లలో 9 వ డిజైన్‌ను ఆవిష్కరించడం, టర్మాక్ నేపథ్యంగా శివమణి ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నామని పేర్కొన్నారు.

బిర్లా ప్లానిటోరియాన్ని సందర్శించిన విద్యార్థులు

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): నగరంలోని తిరుమలగిరి, మహబూబ్‌నగర్ పీఎం కేంద్రీయ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు హైదరాబాద్ బిర్లా ప్లానిటోరియాన్ని సందర్శించారు. తిరుమలగిరి పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులు, మహబూబ్‌నగర్‌కు చెందిన 9, 11వ తరగతి విద్యార్థులు శనివారం పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల ప్రిన్సిపాల్స్ కె.చంద్రశేఖర్, వై.సురేందర్, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులను బిర్లా ప్లానిటోరియానికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా స్కై థియేటర్‌లో ప్లానెటరీ షో, అనంతరం మ్యూజియాన్ని సందర్శించి పలు సైంటిఫిక్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాగా విజ్ఞాన రంగంపై విద్యార్థులకు ఆసక్తిని పెంచడంతో పాటు వారిలో లోతైన ఆలోచన విధానానికి దోహదపడుతుందని ప్రిన్సిపాల్స్ పేర్కొన్నారు.

భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానానికే పెద్దపీట

సుల్తాన్‌బజార్, జనవరి 20: రాబోయే రోజుల్లో సమాజం సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారికే విలువనిస్తుందని, ఈ విషయాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు గమనించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పేర్కొన్నారు. శనివారం హనుమాన్‌టేక్డీలోని ప్రగతి మహా విద్యాలయ డిగ్రీ కళాశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాలు ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ డిపార్ట్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ వి.అప్పారావు, గోల్డెన్ జూబ్లీ కమిటీ చీఫ్ ప్యాట్రన్ మహేశ్ ఎస్ పటేల్, కమిటీ చైర్మన్ గోవింద్ దాస్ షాలతో కలిసి సందీప్ కుమార్ సుల్తానియా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, పూర్వ విద్యార్థులు, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రంజిత్‌రెడ్డిపై కొండా ఫిర్యాదు

బంజారాహిల్స్, జనవరి 20 : చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి తనను దుర్భాషలాడాడంటూ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో వివిధ పార్టీల నాయకులతో రాజకీయ పార్టీల నేతలు రహస్య సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన కొంతమంది బీఆర్ఎస్ నేతలను తన వద్దకు పిలిపించుకున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మూడు రోజుల కింద ఎంపీ రంజిత్‌రెడ్డి ఫోన్ చేసి నిలదీశాడు.దీంతో ఇద్దరు నేతల మధ్య మాటామాట పెరగడంతో పాటు పరస్పర దూషణలకు దిగారు. ఇదిలా ఉండగా శనివారం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనను దుర్భాషలాడిన ఎంపీ రంజిత్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాలుగు రైళ్ల పునరుద్ధరణ

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : కాజీపేట్–డోర్నకల్, విజయవాడ–డోర్నకల్ రైల్వే స్టేషన్ల మధ్య గతంలో నిలిచిపోయిన నాలుగు రైళ్లను తిరిగి పునరుద్ధరిస్తూ శనివారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. పునరుద్ధరించిన రైళ్లు ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి 7 వరకు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా రాష్ట్ర రాకపోకలు కొనసాగుతాయన్నారు.

ఐఐసీటీ సైంటిస్టుకు ఏబీఏపీ అవార్డు

సిటీబ్యూరో, జనవరి 20(నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో చీఫ్ సైంటిస్టుగా సేవలు అందిస్తున్న డా.ఎస్ శ్రీధర్ అవార్డును గెలుచుకున్నారు. అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ సంస్థ ఇచ్చే ఏబీఏపీ సీనియర్ సైంటిస్ట్ అవార్డుకు ఎంపికయ్యారు. కెమికల్ ఇంజినీరింగ్, మెంబ్రేన్ సెపరేషన్ ప్రాసెస్ వంటి కీలక పరిశోధనలకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. తాజాగా ఏబీఏపీ అవార్డు ఎంపికపై ఐఐసీటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు అవార్డు పంపిణీ కార్యక్రమంలో భాగంగా సీసీఎంబీ డైరెక్టర్ డా.వినయ్ నందికూరి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

మాదిగలకు అన్యాయం చేస్తే సహించం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



అభివాదం చేస్తున్న శ్రీనివాస్ గౌడ్, మేడి పాపయ్య, వెంకటయ్య, తదితరులు

ఖైరతాబాద్, జనవరి 20: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేస్తామంటే సహించబోమని వక్తలు పేర్కొన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బడుగులకు తమ డిమాండ్లు చెప్పుకునే స్వేచ్ఛనివ్వాలన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుత కేబినెట్‌లో నామమాత్రంగా మాదిగలకు అవకాశం కల్పించారని, మంత్రి పదవితో పాటు డిప్యూటీ సీఎం, రెండు ఎంపీలు, ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలు తమ సత్తా చూపిస్తారన్నారు. ఈ సమావేశంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య, మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు యాదగిరి మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ గెల్వయ్య, బుడగ జంగాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజలింగం, శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.